క్లుప్తంగా

హెచ్-82 సంఘం జెండా ఆవిష్కరణ



వనపర్తి రూరల్: పెబ్బేరు మండల కేంద్రంలోని టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట హెచ్-82 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు షౌకత్‌పాషా, ప్రధాన కార్యదర్శి సాయిలు, వనపర్తి డివిజన్ నాయకులు రాజుగౌడ్, చందుయాదవ్, తిరుపతిరెడ్డి, ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎండీ నయ్యూం, రామకృష్ణ, రామన్‌గౌడ్, శ్రీనివాసులు, కృష్ణాచారి, రామకృష్ణ, మనోహర్, కిషోర్‌కుమార్, కేశావత్ శ్రీను, వీపనగండ్ల కార్మికులు పాల్గొన్నారు.

మత ప్రచారం అడ్డగింత



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మతప్రచారం చేస్తున్న వారిని గ్రామస్తులు అడ్డుకున్నారు. శుక్రవారం కొందరు వ్యక్తులు క్రిస్టియన్ మతం గురించి గ్రామంలోని ఎస్సీ వాడలో ప్రచారం చేస్తూ కనిపించారు. ఇది గమనించిన కాలనీవాసులు వెంటనే కొందరు పోగై వారిని అడ్డుకున్నారు. ఈ కాలనీకి ఎక్కడి నుంచి వచ్చారని, ఎందుకు మతప్రచారం చేస్తున్నారని పలువురు నిలదీయడంతో పాటుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొడవ జరిగే పరిస్థితి నెలకొనడంతో పోలీసులు అక్కడికి చేరుకుని మతప్రచారం చేస్తున్న వారిని స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో ఇలాంటి మత ప్రచారం చేయడం వలన గొడవలు జరిగే పరిస్థితులు ఏర్పడతాయని చెప్పి పంపించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



గోపాల్‌పేట: ఏదుల మండలంలోని రేకులపల్లి పంచాయతీ పరిధిలోని ఒప్పితండాలో శుక్రవారం నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు ఇరువెంటి శ్రావన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి బొడ్రాయి ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, బలిహరణం, జయాది హోమం,మహాపూర్ణాహుతి, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.అనంత రం అన్నదాత సుఖేందర్‌రెడ్డి, అలివేలమ్మ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు

కొత్తకోట రూరల్: మండలంలోని నాటవెళ్లి శివారులో గల మానవత విశ్వవిద్యాలయంలో 27న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు విద్య, ఆరోగ్యం, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖులతో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిగతా వివరాలకు ఫోన్ నంబర్లు 9966673293, 9966673111 సంప్రదించాలన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

గోపాల్‌పేట: యువత సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో ప్రజలకు సైబర్ నేరాలు, రోడ్డు నిబంధనలు, వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. సెల్‌ఫోన్లలో తెలియని లింకులు ఓపెన్ చేయొద్దని, అపరిచిత వ్యక్తులకు బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ చెప్పొద్దని సూచించారు. చిన్నారులు ఈతకు వెళ్లేటప్పుడు తల్లిదండ్రులు వారి వెంట ఉండాలని కోరారు.

ఉపాధి పనులపై గ్రామసభ



మరికల్: మండల కేంద్రంలో జరిగిన ఉపాధి పనులపై శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసభను నిర్వహించారు. సామాజిక బృందం మరికల్‌లో ఈ ఏడాది జరిగిన రూ.12 లక్షల ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఇందుకు సంబంధించిన మస్టర్, కూలీల పని దినాల హాజరు రికార్డు, రైతుల పొలాల వద్ద జరిగిన పనుల వివరాలను సేకరించారు. కా ర్యక్రమంలో ఎంపీఓ పావని, కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని తుదముట్టించాలి

సాక్షి, నెట్‌వర్క్: రెండు రోజుల క్రితం జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని జిల్లావ్యాప్తంగా ఉన్న బీజేపీ, కాంగ్రెస్, హిందూ, ముస్లిం, న్యాయవాదుల సంఘం సభ్యులు ముక్తకంఠంతో ఖండించారు. ఈ మేరకు శుక్రవారం వారు అమరులకు సంఘీభావంగా కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బాధిత కుటుంబాలకు దేశప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసానిచ్చారు. ఉగ్రవాదులను పట్టుకొని ఉరిశిక్ష అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

- ఆత్మకూర్‌లో ఉగ్రదాడిని నిరసిస్తూ న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తిప్పారెడ్డి, నారాయణగౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీకే రాములు, ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్, ప్రధానకార్యదర్శి ముక్తేశ్వర్, న్యాయవాదులు శంకర్‌లింగం, అశోక్‌గౌడ్, రాంచందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన.

- ఆత్మకూర్‌లో శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ, ముస్లింల ఆధ్వర్యంలో వేర్వేరుగా కొవ్వొత్తులతో అమరులకు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో రహ్మతుల్లా, గంగాధర్‌గౌడ్, పరమేష్, నల్గొండ శ్రీను, నాగేష్, ఎస్టీడీ శ్రీను, విజయలక్ష్మి, సాయిరాఘవ, దామోదర్, మహేష్, ముస్లిం నాయకులు యువకులు పాల్గొన్నారు.



అమరచింతలో అమరులకు నివాళులర్పిస్తున్న ముస్లింలు

- అమరచింత పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో జీఎస్ గోపి, వెంకటేష్, అజయ్, రాజు, పాషా తదితరులు పాల్గొన్నారు. పట్టణ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి అమరులకు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, నిసార్, తౌఫిక్, అశు, నబీ, పాషా, నిస్సార్, అన్సర్, మహిమూద్,ఇమ్రాన్ పాల్గొన్నారు.
- గోపాల్‌పేటలో బీజేవైఎం, బీజేపీ ఆధ్వర్యంలో అమరులకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఆవరణలో కొవ్వొత్తులతో నివాళుర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు శివ, అరవింద్ రెడ్డి, నారాయణ్, వామన్‌గౌడ్, నాగరాజు, ఆనంద్, రాములు, దిలీప్, దామోదర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల ఆధ్వర్యంలో..

- గోపాల్‌పేట మండల కేంద్రంతో పాటు బుద్దారంలో ముస్లింలు నల్ల రిబ్బన్లు కట్టుకుని నివాళులర్పించారు.
- వీపనగండ్లలో ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రత్యేక ప్రార్థనలు చేసి దాడికి పాల్పడ్డవారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సర్దార్‌మియా, ఉపాధ్యక్షులు జావీద్ అలీ, నయ్యూం, రఫీద్, గఫార్, ఖాజామైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కల్వరాలలో..



గోపాల్‌పేటలో..



ఆత్మకూర్‌లో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రోడ్డు విస్తరణలో నిబంధనలు పాటించాలి

వనపర్తి టౌన్: పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని తొలగించమని ప్రమాణం చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి ఎన్నికల అనంతరం ఆలయాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించడం ఏమాత్రం సరైంది కాదని వనపర్తి పాలిటెక్నిక్ రోడ్డు విస్తరణ బాధితులు శుక్రవారం పుర కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి విన్నవించారు. రోడ్ల విస్తరణకు సంబంధించిన కోర్టు తీర్పులను, గతంలో వచ్చిన ప్రకటనలను కమిషనర్‌కు చూయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూల్ రోడ్డులో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కొందరు ఏళ్లతరబడి వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. గంజి రోడ్డు స్థలాలు ఆక్రమించిన వారి వివరాలను ఆధారాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బయటపెట్టారని కమిషనర్ దృష్టికి తెచ్చారు. రోడ్డు విస్తరణలో భాగంగా మార్కింగ్ చేసేందుకు వచ్చే అధికారులు ఇష్టారీతిగా మాట్లాడుతున్నారని బాధితులు వాపోయారు. న్యాయస్థానాల్లో కేసులు ఉన్నా, కోర్టు తీర్పులు ఉన్న వాటిని పరిగణంలోకి తీసుకోకుండా ఎలా విస్తరణకు మార్కింగ్ చేస్తారని ప్రశ్నించారు. ఈ ఏడాది జనవరి 7న రోడ్డు విస్తరణ బాధితులతో సమావేశమైన ఎమ్మెల్యే మేఘారెడ్డి మరోసారి సమావేశమై విస్తరణపై తుది నిర్ణయం తీసుకుందామని చెప్పారని, మరో సమావేశం జరగకముందే మీరెలా చర్యలు చేపడుతున్నారని కమిషనర్‌ను నిలదీశారు.



మున్సిపల్ కమిషనర్‌కు విన్నవిస్తున్న బాధితులు

నిబంధనలకు అనుగుణంగా..

అందరి ఆమోదం, ప్రజల సహకారంతోనే రోడ్ల విస్తరణ చేస్తాం. వ్యాపారుల వాదనలు, వారు ఇచ్చిన ఆధారాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా నిబంధనలకు లోబడి పనులు చేపడతాం.

– ఎస్.వెంకటేశ్వర్లు, కమిషనర్

పౌరాణిక నాటకాలంటే ప్రజలకు మక్కువ

ఖిల్లాఘనపురం: పౌరాణిక నాటకాలంటే ప్రజలకు ఎంతో ఇష్టమని జెడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని సోళీపురంలో ఈ నెల 23 నుంచి శుక్రవారం వరకు శ్రీ చింతల మునిరంగస్వామి నాటక ప్రదర్శన నిర్వహించారు. చివరి రోజు రాత్రి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన నాటక ప్రదర్శన చేసిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్వ కాలంలో గ్రామాల్లో నాటకాలు నిర్వహిస్తున్నారంటే చాలు ఊరు మొత్తం అక్కడికి చేరి ఎంతో శ్రద్ధగా వీక్షించేవారన్నారు. సెల్, కంప్యూటర్, టీవీ లాంటివి వచ్చిన తర్వాత ఈ పౌరాణిక నాటకాలు అంతరించిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో సోళీపురం గ్రామంలో నాటకాన్ని ప్రదర్శించడం చాలా సంతోషించదగిన సమయమన్నారు. కార్యక్రమంలో గంధం నాగరాజు, బీజేపీ మండల నాయకుడు నవీన్‌రెడ్డి, కొత్తూరు మన్యం, జానయ్య, రాచాల వెంకటయ్య, కళాకారులు, ప్రజలు పాల్గొన్నారు.



కళాకారులతో జెడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

కొనుగోలు కేంద్రాలతో రైతులకు ప్రయోజనం

పాన్‌గల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఐకేపీ ఏపీఎం వెంకటేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం పాన్‌గల్, కొత్తపేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులు, మహిళ సంఘాల సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాలకు రూ.500 బోనస్ అందిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని శాగాపూర్‌లో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మాజీ సర్పంచ్ మౌనికయాదవ్, మాజీ ఎంపీటీసీ సుబ్బయ్యయాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో రాముయాదవ్, నరేందర్‌గౌడు, సీసీ నాగరాజు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఏపీఎం బిచ్చన్న, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు శాంతమ్మ అన్నారు. శుక్రవారం పుల్గర్‌చర్లలో మండల మహిళా సమైక్య ద్వారా ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో నరేష్‌కుమార్, కురుమయ్య, కోటిరెడ్డి, సుభాష్, మద్దిలేటి, బాలరాజు, రామచంద్రయ్య, మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం, స్థానిక నాయకులు

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కొత్తకోట: గ్రామ పంచాయతీలో పనిచేసే కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ కొత్తకోట మండల కార్మికులు శుక్రవారం హైదరాబాద్ ప్రగతి భవన్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రతినెల వేతనాలు చెల్లిస్తామని ప్రకటించి, ఇప్పటికి నెలలు గడుస్తున్నా వారి జీతాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని వాపోయారు. కార్యక్రమంలో హనీఫ్, రాములు, నారాయణ, పుల్లయ్య, శారదమ్మ, శాంతమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల దోపిడీని అరికట్టండి

ఆత్మకూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీలు చేస్తున్న దోపిడిని అరికట్టాలని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆత్మకూర్‌లోని మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నిబంధనలకు విరుద్ధంగా రైతుల నుంచి డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవిషయమై స్థానిక మార్కెట్ కార్యదర్శితో వాగ్వివాదానికి దిగారు. ఇతర కొనుగోలు కేంద్రాల వద్ద క్వింటాల్‌కు రూ.30 నుంచి రూ.40 వరకు హమాలీలు వసూలు చేస్తుండగా.. ఇక్కడ రూ. 75 వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం తమ పరిధిలోనది కాదని, హమాలీలతో రైతులే మాట్లాడుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని కార్యదర్శి సమాధానమిచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతులు వెంకటేశ్వర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, విష్ణు, నర్సింహ, వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, అలివేలమ్మ, వెంకట్రాములు ఉన్నారు.



మార్కెట్ కార్యదర్శితో మాట్లాడుతున్న రైతులు

పకడ్బందీగా లబ్ధిదారుల ఎంపిక

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా కొనసాగుతుందని తహసీల్దార్ చాంద్‌పాషా తెలిపారు. శుక్రవారం మండలంలోని పిన్నంచర్లలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రభుత్వం పొందుపర్చిన అంశాలను పరిగణలోకి తీసుకుని సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు.

నిబంధనల మేరకే..

అమరచింత: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు నిబంధనల మేరకు నిర్మించుకుంటేనే బిల్లుల రూపంలో డబ్బులు మంజూరు అవుతాయని తహసీల్దార్ రవికుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. మండలంలోని కొంకన్‌వానిపల్లిలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి నిర్మాణాలపై అవగాహన కల్పించారు. సొంతంగా స్థలం ఉండి, పునాది వరకు నిర్మిస్తే రూ.లక్ష మంజూరు అవుతాయన్నారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు జమ అవుతుందని పేర్కొన్నారు.



కొంకన్‌వానిపల్లిలో లబ్ధిదారురాలికి అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

లీకేజీ నీటితో తాగునీరు కలుషితం



అమరచింత: వాటర్ ట్యాంక్ ద్వారా వచ్చే తాగు నీటి పైప్‌లైన్ లీకేజీలతో పరిసరాలు బురదమయంగా మారడంతో దుర్గంధం, దోమలు విపరీతంగా పెరిగాయంటూ కొంకన్‌వానిపల్లిలో మహిళలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. నీటి కాలుష్యంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారంటూ మహిళలు చేస్తున్న నిరసనకు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ మద్దతు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తాగునీటి ట్యాంక్ వద్ద నీరు లీకేజీ అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామంలోని ఎనిమిదో వార్డులో ఉన్న తాగునీటి ట్యాంకులను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. సమస్యను పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోలేకపోవడం సరికాదన్నారు. సమస్యను పరిష్కరించకపోతే ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో మాధవి, సత్యమ్మ, మన్నెమ్మ, చంద్రి, మంగమ్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని చిన్నమందడి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు ఉపయోగపడే పథకాలను ప్రవేశపెట్టిన కాంగ్రెస్ పార్టీ పాలనపై ప్రజలకు నమ్మకం ఏర్పడిందని, అందుకే వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కష్టపడి పనిచేసే వారికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, పాత, కొత్త తేడా లేకుండా కలికట్టుగా పనిచేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో కొమ్ము నరసింహ, రమేష్, శివకుమార్, మహేష్, కొమ్ము బాలరాజు, గోపాల్, కొమ్ము సురేష్, కొమ్ము రాజకుమార్, కొమ్ము ఆంజనేయులు ఉన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

‘దోమల అంతం మనందరి పంతం’



వీపనగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూర్: దోమల నివారణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని, దోమల అంతం.. మనందరి పంతమని తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఫయాజ్‌అహ్మద్, డాక్టర్ వసంత అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆత్మకూర్‌లో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. నిల్వ నీరు దోమలకు పుట్టినిల్లు అని, వేపాకు పొగ దోమలకు సెగ అని అని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కేశవులు, సీహెచ్‌ఓ సురేష్, ఎంపీహెచ్‌ఈఓ విద్యాసాగర్, హెల్త్‌సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, నాగలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మలేరియాతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధి సోకిన వెంటనే వైద్యాధికారుల సలహాలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం సంభవిస్తుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కేశవులు, జహంగీర్, రామచంద్రమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య


పాన్‌గల్: మెరుగైన విద్య కోసం పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని ఎంఈఓ శ్రీనివాసులు తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం నిర్వహిస్తున్న ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉండటంతో మెరుగైన విద్య అందుతుందన్నారు. దీంతో పాటు ప్రభుత్వం ఉచితంగా రెండు జతల యూనిఫాం, పాఠ్య, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, రాగి జావ, ప్రతి నెల ఆరోగ్య, కంటి పరీక్షలతో పాటు కంటి అద్దాలు అందిస్తున్నట్లు ఆయన తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తల్లిదండ్రులు తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయ బృందం వెంకట్‌నారాయణ, వెంకటేషయాదవ్, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో ఇంటింటి ప్రచారంలో ఎంఈఓ, ఉపాధ్యాయ బృందం

లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలి

అమరచింత: ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టి అర్హులైన నిరుపేదలకు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి డిమాండ్ చేశారు. పట్టణంలోని జీఎస్ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా నిబంధనలకు వ్యతిరేకంగా జరుగుతుందని ఆరోపించారు. వార్డుల వారీగా ఇందిరమ్మ కమిటీలను నియమించిన అధికారులు.. ప్రస్తుతం అధికార పార్టీ నాయకులు చెప్పిన వివరాల ప్రకారం నివేదికలను తయారు చేస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లను ఎంపిక చేయాలంటే వార్డులో కమిటీ ద్వారా అక్కడి ప్రజలతో కలిసి సమావేశం నిర్వహించాలని, వారిలో అసలైన నిరుపేదలను గుర్తించి వారి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. నిజమైన అర్హులను ఎంపిక చేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముట్టడించి ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాజు, అజయ్, వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపి

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలో శుక్రవారం భార్యభర్తలు బైక్‌పై ప్రయాణిస్తూ అదుపు తప్పి కిందపడడంతో ఒకరికి తీవ్ర గాయాలు అయిన ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వడ్డె వెంకటయ్య, వెంకటమ్మ దంపతులు బైక్‌పై తూంకుంట వైపు వెళ్తూ గ్రామ సమీపంలోని బస్‌స్టేషన్ వద్ద కిందపడ్డారు. దీంతో వెంకటయ్య తలకు తీవ్ర గాయం కావడంతో పాటు కాలు విరిగిందని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం వనపర్తి జిల్లా ఆస్పత్రికి, అక్కడ నుంచి హైదరాబాద్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సగరుల అభ్యున్నతికి కృషి



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని కోదండరామస్వామి ఆలయం వద్ద సాగర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుక సత్యం ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఏదుట్ల గ్రామానికి చెందిన నీరడి విష్ణు, ఉపాధ్యక్షుడిగా అయోధ్యరాములు, సహాయ కార్యదర్శిగా చంద్రాయుడు, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు విష్ణు మాట్లాడుతూ సగరుల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సత్యనారాయణ, చీర్ల విష్ణు, స్వామి, జనార్ధన్, చిన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న విద్యార్థి



కొత్తకోట రూరల్: తనకు దొరికిన సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించి ఓ విద్యార్థి నిజాయితీ చాటుకున్నాడు. పాన్‌గల్ మండలం కేతపల్లి గ్రామానికి చెందిన కోట్ల భవీణ్ కుమార్‌రెడ్డి అనే అబ్బాయి ఆత్మకూర్ ఎంవీ రామన్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. తండ్రి వెంకటబుచ్చిరెడ్డితో కలిసి బైక్‌పై ఆత్మకూర్ నుంచి వనపర్తికి వెళ్తుండగా కొత్తకోట సమీపంలోకి రాగానే రూ.25వేల విలువ గల సెల్‌ఫోన్ భవీణ్ కుమార్‌రెడ్డికి కనిపించడంతో తండ్రికి చెప్పి బైక్‌ను ఆపారు. ఇద్దరు కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సెల్‌ఫోన్‌ను ఏఎస్‌ఐ రామకృష్ణ, హెచ్‌డ్‌కానిస్టేబుల్ కుర్మయ్య గౌడ్‌కు అప్పగించారు. నిజాయితీ చాటుకున్న భవీణ్‌కుమార్‌రెడ్డి ఎస్‌ఐ ఆనంద్ అభినందించారు.